TGTEL/26/A4985

ఆదాబ్ సైబరాబాద్

తెలుగు దినపత్రిక

ADAAB CYBERABAD DAILY NEWS PAPER

www.adaabcyberabad.com
epaper.adaabcyberabad.com
adaabcyberabad@gmail.com

PUBLISHED FROM : HYDERABAD-MEDCHEL MALKAJGIRI-RANGAREDDY

ఎడిటర్ : బిఎస్ శివ కుమార్ సంపుటి : 1 సంచిక : 86 శనివారం, అక్టోబర్ 10, 2026 , పేజీలు - 4 వెల: 5/-

EDITOR : BILLALPURSARA SHIVA KUMAR VOLUME : 1 ISSUE: 86 10-10-2026 (SATURDAY) PAGES: 4 RS : 5/-

జీఓ 59 పెండింగ్ దరఖాస్తులకు
నెల రోజుల్లో పరిష్కారం

- 500 గజాలలోపు జీవో 59 పెండింగ్ దరఖాస్తులకు నెలలో పరిష్కారం చూపిస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు.
- ఇందుల్లో అక్రమాలకు తావులేదన్నారు.

తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

హైదరాబాద్ : హైదరాబాద్, అక్టోబర్ 9: 22ఎ సమస్యలపై సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీల అమలులో మరో కీలక ముందడుగు పడిందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. (శుక్రవారం) మీడియాతో మాట్లాడుతూ.. 22ఎ సమస్యల పరిష్కారానికి ఇప్పటివరకు ఏడు కీలక ఉత్తర్వులు ఇచ్చినట్లు చెప్పారు. తాజాగా జీఓ 59 దరఖాస్తుదారులకు ప్రభుత్వం శుభవార్త చెప్పిందన్నారు. 500 చదరపు గజాలలోపు జీఓ 59 పెండింగ్ దరఖాస్తులకు నెల రోజుల్లో పరిష్కరిస్తామని వెల్లడించారు. ఈ మేరకు కలెక్టర్లకు ప్రభుత్వం కీలక ఆదేశాలు ఇస్తూ.. మెమో నెం.48030 జారీ చేసినట్లు తెలిపారు.జీఓ 59 అమలులో అక్రమాలకు తావులేదని.. నిబంధనల ప్రకారమే నిర్ణయాలు ఉంటాయని మంత్రి స్పష్టం చేశారు. గతంలో జీఓ 59 అమలులో జరిగిన అక్రమాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే జారీ చేసిన కన్వేయన్స్ డీడ్స్ కేసులను కూడా సమగ్రంగా పరిశీలించాలన్నారు. 22-ఎపై శరవేగంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. సీఎం హామీ ఇచ్చిన 24 గంటల్లోనే 22-ఎ సమస్యలపై ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేశామన్నారు. 22-ఎకు సంబంధించిన 10-12 సమస్యలను ఫాస్ట్‌ట్రాక్‌లో ప్రభుత్వం పరిష్కరిస్తోందని తెలిపారు. జీఓ118, జీఓ 76లకు అనుగుణంగా స్పష్టమైన మెమోలు జారీ చేసినట్లు చెప్పారు.మున్సిపల్ అనుమతులున్న ఇళ్లు, ప్లాట్లు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లకు అనుమతిస్తామని మంత్రి తెలిపారు. పరిష్కారం చూపుతామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

'సర్' పై బీఆర్ఎస్ మౌనం.

హైదరాబాద్, అక్టోబర్ 9: బీఆర్ఎస్ నేతలపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. 'సర్' ఆందోళనలో బీఆర్ఎస్ ఎక్కడుందని ప్రశ్నించారు. సీఈసీ తప్పిదం చేస్తుంటే హరీశ్ రావు, కేటీఆర్ ఎందుకు మాట్లాడట్లేదని నిలదీశారు. నిరసన కార్యక్రమం ఎందుకు చేయడం లేదన్నారు. బీజేపీతో బీఆర్ఎస్ లోపాయికారి ఒప్పందం కుదుర్చుకుందని ఆరోపించారు. బీజేపీకి వ్యతిరేకంగా మాట్లాడితే ఈ-ఫార్ములా కేసులో అరెస్ట్ చేస్తారని, కాళేశ్వరం కేసులో సీబీఐ అరెస్ట్ చేస్తుందని భయమా అని ప్రశ్నించారు. ఉండటానికి ఇల్లు లేదన్న కేటీఆర్‌కు ఫైవ్‌స్టార్ హోటల్స్ ఎలా వచ్చాయని.. ఆయనకు ఇన్ని వేలకోట్ల ఆస్తులు ఎలా వచ్చాయని నిలదీశారు. సర్' ప్రక్రియపై దేశ వ్యాప్తంగా బీజేపీ, మిత్ర పక్షాలు తప్ప అన్ని పార్టీలు రోడ్డెక్కాయన్నారు.

ఫలితాలు వచ్చినప్పుడే ప్రజాస్వామ్యం ఉన్నట్టా?

హైదరాబాద్: ఫలితాలు వ్యతిరేకిస్తే రాజ్యాంగ సంస్థలపై కాంగ్రెస్ విష ప్రచారం చేస్తుందని మండిపాటుకాంగ్రెస్ పార్టీకి, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి ప్రజా తీర్పును గౌరవించడం అలవాటు లేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. రాహుల్ గాంధీ పనితీరులో ఒక వింత, ప్రమాదకరమైన ధోరణి కనిపిస్తోందని ఆయన ఆరోపించారు. వారికి అనుకూలంగా ఫలితాలు వచ్చినప్పుడే ప్రజాస్వామ్యం ఉన్న ట్టా? అని ప్రశ్నించారు. ఫలితాలు వ్యతిరేకంగా వస్తే రాజ్యాంగ సంస్థలపై విష ప్రచారం చేస్తారా? అని నిలదీ శారు. కాంగ్రెస్ పార్టీ తన రాజకీయ ప్రయోజ నాలకు అనుగుణంగా పనిచేయనప్పుడల్లా ఎన్నికల సంఘం, కాగ్, న్యాయవ్యవస్థ, పార్లమె ంట్ వంటి రాజ్యాంగ సంస్థల విశ్వసనీయతను దెబ్బ తీయడం అలవాటుగా మార్చుకుందని ఆయన ఆరోపించారు. ప్రజాతీర్పు వ్యతిరేకంగా వచ్చినప్పుడు, రాజ్యాంగ సంస్థలు అవినీతిమయమయ్యాయని కాంగ్రెస్ నేతలు ఆరోపణలకు దిగుతున్నారని కిషన్ రెడ్డి మండిపడ్డారు.

సీఈసీ జ్ఞానేష్ కుమార్
రాజీనామా చేయాలి

ఢిల్లీ, అక్టోబర్ 9: సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి డిమాండ్ చేశారు. (శుక్రవారం) మీడియాతో మాట్లాడుతూ.. ఈసీకి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న ఇండియా కూటమి ఎంపీలపై కేంద్రం పోలీసుల ద్వారా రాజ్యం ఏలుతోందని విమర్శించారు. ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలపై పోలీసులతో భౌతిక దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. ఈరోజు మధ్యాహ్నం 3 గంటలకు పార్లమెంట్‌లో ఇండియా కూటమి ఎంపీల సమావేశం జరుగనుందని తెలిపారు.ఈ సమావేశంలో భవిష్యత్తు కార్యాచరణ చేపడతామని ఎంపీ అన్నారు. తప్పు చేసిన జ్ఞానేష్ కుమార్, తప్పు చేయించిన మోదీ, అమిత్ షా శిక్షకు అర్హులని వ్యాఖ్యానించారు..

ఏపీ స్థానిక సంస్థల ఎన్నికలకు
సుప్రీంకోర్టు గ్రీన్‌సిగ్నల్

- ఓటర్ల జాబితా, బీసీ రిజర్వేషన్లపై కీలక ఆదేశాలు
- వైసీపీ పిటిషన్ తోసిపుచ్చిన సుప్రీంకోర్టు- సీజేఐ తీవ్ర వ్యాఖ్యలు

అమరావతి, అక్టోబర్ 9: ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సర్వోన్నత న్యాయస్థానం మార్గం సుగమం చేసింది. ఏపీ హైకోర్టు విధించిన ఆరు వారాల గడువులోగా ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర ఎన్నికల సంఘం సుప్రీంకోర్టుకు స్పష్టం చేసింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసులో కీలక ఉత్తర్వులు జారీ చేస్తూ, ఎన్నికల ఆలస్యానికి తావులేకుండా ముందుకు వెళ్లాలని ఆదేశించింది.ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే సమయానికి 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ పూర్తయితే, కొత్తగా రూపొందించిన సమగ్ర ఓటర్ల జాబితా ఆధారంగానే ఎన్నికలు నిర్వహించాలి. ఒకవేళ నోటిఫికేషన్ సమయానికి ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ పూర్తి కాకపోతే, ప్రస్తుత పాత ఓటర్ల జాబితా ప్రకారమే స్థానిక సంస్థల ఎన్నికలను పూర్తి చేయాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.వార్డుల పునర్విభజనను సవాలు చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (ఘ=జూ) దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. 'ఎన్యూమరేటర్లకు, కేంద్ర ప్రభుత్వానికి లేని ఇబ్బంది వైఎస్సార్‌సీపీకి ఎందుకు వస్తోంది?' అని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం ఘాటుగా ప్రశ్నించింది. స్థానిక సంస్థల ఎన్నికలను కావాలనే వాయిదా వేయించాలనే దురుద్దేశం ఈ పిటిషన్‌లో కనిపిస్తోందని, ఇది ప్రజాప్రయోజనాలకు విరుద్ధమని వ్యాఖ్యానించింది.బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఏపీ ప్రభుత్వం జారీ చేసిన జీవోలను రద్దు చేస్తూ ఏపీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సుప్రీంకోర్టు సమర్థించింది. ప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్ (ఝ్రా) ను కొట్టివేసిన కోర్టు, సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం గతంలో నిర్దేశించిన పరిమితి ప్రకారం మొత్తం రిజర్వేషన్లు ఏ పరిస్థితుల్లోనూ 50 శాతానికి మించకూడదని పునరుద్ఘాటించింది.

సర్'పై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి



హైదరాబాద్: హైదరాబాద్, అక్టోబర్9: 'సర్' ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తన పదవి నుంచి తప్పుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఎలక్షన్ కమిషన్‌పై మండిపడ్డారు.'వ్యక్తుల కంటే వ్యవస్థలే గొప్పవి. ఒక్క వ్యక్తిని కాపాడేందుకు ఇంత ఆరాటం ఎందుకు?.. భారత రాజ్యాంగం కంటే ఎవరూ గొప్పవారు కాదు. భారత పౌరుల ఓటుహక్కును హరించే అధికారం ఎవరికీ లేదు. 140 కోట్ల మంది భారతీయుల హక్కుల కంటే ఒక్క వ్యక్తి గొప్పవాడా?.. ఎలక్షన్ కమిషన్‌లో జరుగుతున్న అక్రమాలకు బాధ్యత వహించి.. జ్ఞానేశ్ కుమార్ పదవి నుంచి వైదొలగాలి. 'సర్' ప్రక్రియపై స్వతంత్ర దర్యాప్తునకు బీఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. 'సర్' ప్రక్రియపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి నేతృత్వంలో లోతుగా విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నాం' అని కేటీఆర్ పేర్కొన్నారు.

ఏపీ కేబినెట్ ప్రత్యేక భేటీ..
బీసీ రిజర్వేషన్లపై కీలక చర్చ

అమరావతి, అక్టోబర్ 9: ఏపీ కేబినెట్ ప్రత్యేకంగా సమావేశంకానుంది. ఉదయం 11 గంటలకు సచివాలయంలో కేబినెట్ భేటీ జరుగనుంది. బీసీ రిజర్వేషన్లపై జీవోలను సుప్రీంకోర్టు కొట్టివేయడంతో రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్‌పై చర్చించేందుకు కేబినెట్ సమావేశమవనుంది. కమిషన్ నివేదికను మంత్రివర్గం పరిగణలోకి తీసుకోనుంది. బీసీలకు రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ సిఫార్స్ చేసిన రిజర్వేషన్లు, జనాభా లెక్కలను పరిగణలోకి తీసుకొని వారికి రిజర్వేషన్లు ఇవ్వాలని కేబినెట్ నిర్ణయించనున్నట్లు సమాచారం. మంత్రివర్గం నిర్ణయానికి అనుగుణంగా వెంటనే జీవోలను ప్రభుత్వం విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. గతంలో బీసీ రిజర్వేషన్లపై విడుదల చేసిన జీవోలను ప్రభుత్వం ఉపసంహరించుకోనున్నట్లు సమాచారం. కేబినెట్ సమావేశానికి మంత్రులందరూ రావాలని సచివాలయం ఆదేశాలు జారీ అయ్యాయి.

ప్రజల విశ్వాసాన్ని
ఈసీ కోల్పోతోంది

హైదరాబాద్: భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు ఎన్నికల సంఘం (ఈసీ) వెన్నెముక వంటిదని, అది అధికారంలో ఉన్నవారికి రక్షణ కవచంలా మారకూడదని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం పనితీరు, నియామ కాలపై వస్తున్న ప్రశ్నలతో రాజ్యాంగ పునాదులు బలహీనపడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.ఓటర్ల జాబితా సవరణలో (సర్) భాగంగా పెద్ద ఎత్తున ఓట్లను తొలగించడం వల్లే ఈసీపై ప్రజలకు నమ్మకం పోతోందన్నారు. "ప్రజాస్వామ్యం అన్నింటికన్నా గొప్పది. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టడంలో విఫలమైతే, అందుకు బాధ్యత వహిస్తూ సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తప్పుకోవాలి" అని హరీశ్ రావు స్పష్టం చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 324, 325, 326 ప్రకారం స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాతమైన ఎన్నికలు జరగాలని గుర్తుచేశారు.

దసరా సెలవుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఇళ్ల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి
వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా సూచన



ఆదాబ్ సైబరాబాద్, డెస్క్ : దసరా పండుగ, విద్యాసంస్థలకు సెలవుల నేపథ్యంలో విద్యార్థులు, కుటుంబ సభ్యులు స్వగ్రామాలకు వెళ్లే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా సూచించారు. సెలవుల సమయంలో ఇళ్ల భద్రతతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణ, పిల్లల రక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆమె కోరారు. ప్రజలు ఇళ్ల నుంచి బయలుదేరే ముందు తలుపులు, కిటికీలు పటిష్టంగా మూసివేయాలని, బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులను భద్రంగా ఉంచుకోవాలని ఎస్పీ సూచించారు. ఇంట్లో ఎవరూ లేని విషయాన్ని సామాజిక మాధ్యమాల్లో బహిరంగంగా వెల్లడించకూడదని, అనుమానాస్పద వ్యక్తులు లేదా కదలికలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ప్రయాణ సమయంలో ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించేవారు సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు. అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ ఉపయోగించరాదని స్పష్టం చేశారు. రద్దీ ప్రదేశాల్లో పిల్లలను ఒంటరిగా వదిలివేయకూడదని, ప్రయాణాల్లో వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎస్పీ కోరారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం వికారాబాద్ జిల్లా పోలీస్ శాఖ నిరంతరం అప్రమత్తంగా ఉంటుందని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112కు ఫోన్ చేసి పోలీసుల సహాయం పొందాలని, పోలీసులకు సహకరిస్తూ దసరా పండుగను ప్రశాంతంగా, సురక్షితంగా జరుపుకోవాలని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

బాలాజీనగర్‌లో మహిళా భద్రతపై అవగాహన కార్యక్రమం

పోక్సో చట్టం, సైబర్ నేరాలు, మహిళల రక్షణపై
విద్యార్థులకు అవగాహన

ఆదాబ్ సైబరాబాద్, బాలాజీనగర్ : మహిళలు, బాలికల భద్రతకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించేందుకు బాలాజీనగర్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళల రక్షణ, బాలల హక్కులు, సైబర్ నేరాల నివారణకు సంబంధించిన అంశాలను వివరించారు.జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ, మల్కాజిగిరి పరిధిలోని బాలాజీనగర్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారానికి అందుబాటులో ఉన్న చట్టపరమైన మార్గాలపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధినియం వంటి నూతన చట్టాలతో పాటు పోక్సో చట్టం, సైబర్ నేరాల గురించి వివరించారు. మహిళలు, బాలికలపై జరిగే నేరాలను అరికట్టడంలో చట్టాలపై అవగాహన కీలకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్వయంకృషి సంస్థ ప్రతినిధులు, డైరెక్టర్, ఫౌండర్ శ్రీమతి మంజుల కళ్యాణ్, సిబ్బంది, ఉపాధ్యాయులు, నామినేటెడ్ సభ్యులు పాల్గొన్నారు. మహిళలు, బాలికల భద్రతపై అవగాహన పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు.

సుల్తాన్‌పూర్ తండా పాఠశాలలో బతుకమ్మ సంబరాలు

ఆదాబ్ సైబరాబాద్. పరిగి. వికారాబాద్ జిల్లా పరిగి మున్సిపాలిటీ పరిధిలోని సుల్తాన్‌పూర్ తండా ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు పండుగ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యూసుఫ్, అంగన్‌వాడీ టీచర్ అనిత, పీఆర్‌టీయూ పరిగి మండల శాఖ అధ్యక్షుడు మంచనపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంచనపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థుల్లో చిన్నతనం నుంచే మన సంప్రదాయాలు, సంస్కృతి, నైతిక విలువల పట్ల అవగాహన పెంపొందించాలని అన్నారు. విద్యాబోధనతోపాటు పండుగలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్థులకు మన సంస్కృతి గొప్పతనాన్ని తెలియజేయవచ్చని పేర్కొన్నారు. అందులో భాగంగానే పాఠశాలల్లో బతుకమ్మ, దసరా వంటి పండుగలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా పరిగి మండలంలోని విద్యార్థినీ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.ం

డంపింగ్ యార్డు ఎత్తివేతపై అఖిలపక్ష నిర్ణయాలు అమలు చేయాలి

ఆదాబ్ సైబరాబాద్, జవహర్ నగర్ : జవహర్‌నగర్ రాంకీ డంపింగ్ యార్డును శాశ్వతంగా తొలగించాలని, గతంలో అఖిలపక్ష కమిటీ తీసుకున్న నిర్ణయాలను వెంటనే అమలు చేయాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ప్రగతినగర్‌లోని నీలం రామచంద్రయ్య భవన్‌లో జేఏసీ చైర్మన్ షేక్ షావలి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సోమవారం ప్రజావాణిలో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. డంపింగ్ యార్డు ప్రభావిత ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు, స్వచ్ఛమైన తాగునీటి సదుపాయాలు కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమం లో కన్వీనర్ ఉమామహేష్, కోశాధికారి పి.శివబాబు, ఎస్.కె.మీరా, రావల్ కోల్ నర్సింహ గౌడ్, గడ్డం సదానందం, వై.మల్లేష్, కొన్నె వేణు, గడిపే సునీత, వి.ప్రవీణ్, డి.జాన్, చంద్రమౌళి, మహ్మద్ పాషామియా, జయసుధ, డి.స్వరూప, ఎం.డి.జావేద్, షేక్ మస్తాన్ బీ, బండకింది సింగరయ్య గౌడ్, మబ్బు బాలు, సురేందర్, మహ్మద్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.

యూరప్ పర్యటన ముగించుకుని స్వదేశానికి వచ్చిన శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌కు ఘన స్వాగతం

స్వాగతం పలికిన వికారాబాద్ మున్సిపల్ కౌన్సిలర్లు, జర్నలిస్టులు, నాయకులు

ఆదాబ్ సైబరాబాద్, డెస్క్ : యూరప్ పర్యటనలో భాగంగా కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ (సీపీఏ) కార్యక్రమాల్లో పాల్గొని, పర్యటనను విజయవంతంగా ముగించుకుని స్వదేశానికి తిరిగి వచ్చిన తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌కు వికారాబాద్ మున్సిపల్ కౌన్సిలర్లు హృదయపూర్వక స్వాగతం పలుకుతూ, శాలువా – పుష్పగుచ్చాలతో శుభాకాంక్షలు తెలిపారు. అంతర్జాతీయ వేదికపై తెలంగాణ రాష్ట్ర శాసన వ్యవస్థకు ప్రాతినిధ్యం వహిస్తూ సీపీఏ కార్యక్రమాల్లో పాల్గొనడం రాష్ట్రానికి గర్వకారణమని కౌన్సిలర్లు పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలు, శాసన వ్యవస్థ ప్రాధాన్యతను అంతర్జాతీయ స్థాయిలో చాటిచెప్పే కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. పర్యటనను విజయవంతంగా ముగించుకుని రాష్ట్రానికి తిరిగి వస్తున్న శాసనసభాపతికి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం, ప్రజాస్వామ్య పరిరక్షణ దిశగా ఆయన చేపట్టే కార్యక్రమాలు మరింత ముందుకు సాగాలని వికారాబాద్ మున్సిపల్ కౌన్సిలర్లు అభిలషించారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ మునిసిపల్ కౌన్సిలర్లు దుర్గ మల్లికార్జున గౌడ్, కొప్పుల రామకృష్ణ రెడ్డి, బి.వినోద్, హిరేకర్ రాకేష్, నాయకులు మున్నూర్ శ్రీకాంత్, కాకి నాగరాజ్, మాల శ్రీకాంత్, బాదం అశోక్, మధుకర్, బాలకృష్ణ, ముడావత్ శ్రీకాంత్ నాయక్, జర్నలిస్ట్ యూనియన్ టీయూడబ్ల్యూజే–ఐజేయు వికారాబాద్ నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ జాక వెంకటేష్, తదితరులు ఉన్నారు.

వికారాబాద్‌లో నూతన క్రిమినల్ చట్టాలపై పోలీసులకు శిక్షణ

జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాలతో మూడవ బ్యాచ్ ప్రారంభం
42 మంది అధికారులు, సిబ్బంది హాజరు

ఆదాబ్ సైబరాబాద్, డెస్క్ : వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో జిల్లా ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసులకు నూతన క్రిమినల్ చట్టాలపై నిర్వహిస్తున్న ఒకరోజు అవగాహన శిక్షణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మూడవ బ్యాచ్ శిక్షణ ప్రారంభమైంది. ఈ శిక్షణలో వివిధ హోదాలకు చెందిన 42 మంది పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.
ఈ కార్యక్రమంలో నూతన క్రిమినల్ చట్టాల్లోని ముఖ్యమైన నిబంధనలు, వాటి అమలు విధానం, విధి నిర్వహణలో పాటించాల్సిన చట్టపరమైన అంశాలు, కేసుల దర్యాప్తులో అనుసరించాల్సిన మార్గదర్శకాలపై పోలీసులకు అవగాహన కల్పించారు. చట్టాలకు అనుగుణంగా విధులు నిర్వహించడంతో పాటు, నేరాల దర్యాప్తును సమర్థవంతంగా చేపట్టేందుకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించడంపై శిక్షణలో ప్రత్యేక దృష్టి సారించారు.పోలీసు సిబ్బందికి నూతన క్రిమినల్ చట్టాలపై పూర్తి అవగాహన కల్పించడం, నిరంతర శిక్షణ ద్వారా వారి పనితీరును మెరుగుపరచడం, ప్రజలకు మరింత సమర్థవంతమైన పోలీసు సేవలు అందించడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని జిల్లా పోలీస్ శాఖ తెలిపింది.ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రం డీఎస్పీ శ్రీనివాస్, ఏహెచ్‌టీయూ ఇన్‌స్పెక్టర్ అన్వర్ పాషా, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాలతో కుల్కచర్లలో విస్తృత పోలీసు తనిఖీలు

107 మంది పోలీసులతో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్
54 ద్విచక్ర వాహనాలు, 2 ఆటోలు, 34 లీటర్ల మద్యం స్వాధీనం

ఆదాబ్ సైబరాబాద్, డెస్క్ : వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల నివారణ, శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా శుక్రవారం తెల్లవారుజామున కుల్కచర్ల మండల కేంద్రంలో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించడంతో పాటు పోలీసు--ప్రజల మధ్య సంబంధాలను బలోపేతం చేసేందుకు శుక్రవారం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ చేపట్టారు. పరిగి డీఎస్పీ ఎన్.శ్రీనివాస్ పర్యవేక్షణలో ఉదయం 5 నుంచి 7 గంటల వరకు కుల్కచర్ల గ్రామంలోని కిండిగేరి ప్రాంతంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో మొత్తం 107 మంది పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని ఇళ్లను, వాహనాలను తనిఖీ చేశారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలను పరిశీలించారు. తనిఖీల్లో భాగంగా 54 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలు, 34 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నేర నియంత్రణ చర్యల్లో భాగంగా ఇద్దరు రౌడీషీటర్లను తనిఖీ చేసి వారి వివరాలను పరిశీలించారు.
సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి: డీఎస్పీ ఎన్.శ్రీనివాస్
ఈ సందర్భంగా డీఎస్పీ ఎన్. శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. గ్రామాలు, ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేరాలను అరికట్టడంతో పాటు నేరాలకు పాల్పడిన వ్యక్తులను గుర్తించడం సులభమవుతుందని వివరించారు.
జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఇలాంటి కార్యక్రమాల ద్వారా నేరాల నివారణ, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ, ప్రజలకు మెరుగైన భద్రత కల్పించడంపై పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ప్రజలు కూడా పోలీసులకు సహకరిస్తూ నేరాల నియంత్రణలో భాగస్వాములు కావాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో కొడంగల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, పరిగి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కొండల్ రెడ్డి, కుల్కచర్ల, పరిగి, చెంగోముల్, దోమ, కొడంగల్, బొంరాస్‌పేట్, దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు,12 మంది మహిళాపోలీసు కానిస్టేబుళ్లు,ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

మానసిక ఆరోగ్యంపై అవగాహనతోనే మెరుగైన జీవనం

వృద్ధులు, దివ్యాంగుల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలి: డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఎ. రాధిక

ఆదాబ్ సైబరాబాద్, డెస్క్ : ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా వికారాబాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కొంపల్లిలోని మహిమా మినిస్ట్రీస్ వృద్ధాశ్రమం, మానసిక వైకల్యాలు కలిగిన వ్యక్తుల గృహంలో న్యాయ అవగాహన, ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎ.రాధిక హాజరై, ఆశ్రమ నివాసితులు, సిబ్బందితో మాట్లాడారు. మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం, అవసరమైన వైద్య చికిత్స అందించడం, భావోద్వేగ మద్దతు కల్పించడం, మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని గౌరవంగా చూడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆమె పేర్కొన్నారు. తల్లిదండ్రులు, వృద్ధ పౌరుల నిర్వహణ, సంక్షేమ చట్టం--2007, దివ్యాంగుల హక్కుల చట్టం--2016, మానసిక ఆరోగ్య సంరక్షణ చట్టం--2017 ప్రకారం వృద్ధులు, దివ్యాంగులు, మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వ్యక్తులకు ఉన్న హక్కులు, చట్టపరమైన రక్షణలను వివరించారు. అర్హులైన వారికి ఉచిత న్యాయ సహాయం అందించడంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.
ఆశ్రమంలో వసతులు, ఆహార నాణ్యతపై ఆరా
సందర్శనలో భాగంగా ఎ.రాధిక ఆశ్రమంలోని ప్రతి నివాసితుడితో వ్యక్తిగతంగా మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులు, వైద్య చికిత్స, ఆహారపు అలవాట్లు, రోజువారీ సంరక్షణ గురించి తెలుసుకున్నారు. సమయానికి భోజనం, సరైన పోషకాహారం, అవసరమైన వైద్య సేవలు అందుతున్నాయా అని ఆరా తీశారు. అనంతరం వంటగదిని పరిశీలించి ఆహార నాణ్యత, పరిమాణం, పరిశుభ్రతపై వివరాలు తెలుసుకున్నారు. నివాసితులకు మెరుగైన సంరక్షణ అందించే అంశంపై నిర్వహణ సిబ్బందితో చర్చించారు.ఈ శిబిరంలో డాక్టర్ పి.వహాబ్, ఆయన వైద్య బృందం పాల్గొని ఆశ్రమ నివాసితులకు వైద్య సేవలు అందించారు. జిల్లా ప్రధాన న్యాయ సహాయ రక్షణ న్యాయవాది టి.వెంకటేష్, సహాయ న్యాయ సహాయ రక్షణ న్యాయవాది ఎం.శ్రీనివాస్, వైద్య బృంద సభ్యులు, ఆశ్రమ నిర్వాహకులు, సిబ్బంది, నివాసితులు పాల్గొన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారి హక్కులను పరిరక్షించడం, న్యాయ సహాయం, వైద్య సంరక్షణ, సామాజిక సంక్షేమ సేవలు వారికి అందుబాటులో ఉండేలా చూడటమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

చిన్నారిపై వీధి కుక్కల దాడి.!

పరిగిలోని తిరుమల రెసిడెన్సి కాలనీలో స్వైరవిహారం
వరుస ఘటనలతో భయాందోళనలో స్థానికులు

ఆదాబ్ సైబరాబాద్, పరిగి: వికారాబాద్ జిల్లా పరిగి మున్సిపాలిటీ పరిధిలోని తిరుమల రెసిడెన్సి కాలనీలో వీధి కుక్కల బెడదతో స్థానికులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. కాలనీలో వీధి కుక్కలు చిన్నారులపై దాడులకు పాల్పడుతుండటంతో తల్లిదండ్రులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.స్థానికుల కథనం ప్రకారం.. పాఠశాలకు వెళ్తున్న ఓ చిన్నారిపై వీధి కుక్క దాడి చేసింది. గురువారం మరో బాలుడి గొంతు పట్టుకుని కుక్క దాడికి పాల్పడినట్లు తెలిపారు. వరుసగా ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటుండటంతో కాలనీలోని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.పిల్లలను బయటకు పంపాలంటేనే భయం కాలనీలో వీధి కుక్కల సంచారం పెరగడంతో పిల్లలను బయటకు పంపాలంటేనే తల్లిదండ్రులు భయపడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పాఠశాలలకు వెళ్లే చిన్నారుల భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఎప్పుడు, ఎక్కడ కుక్కలు దాడి చేస్తాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.అధికారులు స్పందించాలని విజ్ఞప్తి కాలనీలో వరుసగా ఘటనలు జరుగుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి కుక్కల బెడదను నియంత్రించేందుకు తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. చిన్నారుల భద్రతకు ప్రాధాన్యమిస్తూ, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మోత్కూర్ పాఠశాలలో ఘనంగా ముందస్తు బతుకమ్మ సంబరాలు.

ప్రధానోపాధ్యాయుడు కే, పాండు సారధ్యంలో.

ఆదాబ్ సైబరాబాద్. పరిగి. వికారాబాద్ జిల్లా దోమ మండలం మోత్కూర్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ముందస్తు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. దీంతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని విద్యార్థులు ఆనందోత్సాహాల మధ్య సంబరాలు జరుపుకున్నారు. పూలతో పేర్చిన బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ సందడి చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. పాఠశాల స్థాయిలో ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్థులకు తెలంగాణ సంప్రదాయాలు, సంస్కృతిపై అవగాహన పెంపొందుతుందని ఉపాధ్యాయులు తెలిపారు.

తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ

ఆదాబ్ సైబరాబాద్, శంకర్ పల్లి :– మొకిలా మాస్టర్‌మైండ్స్ స్కూల్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులు బతుకమ్మ సంబరాలను ఉత్సాహంగా జరుపుకున్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించి తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ అన్నపూర్ణ మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతికి ప్రతీక అని, ప్రకృతిని ఆరాధిస్తూ ఐక్యతను చాటే గొప్ప పండుగ అని అన్నారు. విద్యార్థులు తమ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ భావితరాలకు అందించాలని సూచించారు.పాఠశాల చైర్మన్ రాజు సంగాని, డైరెక్టర్ రవి యాదవ్ విద్యార్థులు, ఉపాధ్యాయులను అభినందించారు. ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల్లో సంప్రదాయాల పట్ల అవగాహనతో పాటు ఐక్యతా భావాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల సందడి మధ్య బతుకమ్మ సంబరాలు ఘనంగా ముగిశాయి.

ప్రత్యేక అవసరాల విద్యార్థులకు న్యాయ సేవలపై అవగాహన

అదాబ్ సైబరాబాద్, జవహర్‌నగర్: ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జవహర్‌నగర్‌లోని స్వయంకృషి స్వచ్ఛంద సంస్థలో న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి జి.ఎస్.ఎల్. ప్రియాంక విద్యార్థులకు ఉచిత న్యాయ సేవలు, చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రత్యేక అవసరాల విద్యార్థులకు శిక్షణ, విద్య అందిస్తూ వారు స్వయం శక్తితో ఎదిగేలా కృషి చేస్తున్న స్వయంకృషి సంస్థ నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు మంజుల కళ్యాణ్, న్యాయ సేవాధికార సంస్థ నామినేటెడ్ సభ్యులు సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇండియా పోస్ట్ డిజిటల్ సేవల విస్తరణ

తెలంగాణలో నెలకు రూ.500 కోట్ల పింఛన్ల పంపిణీ చేస్తున్న తపాలా
263 ఆధార్ కేంద్రాల ద్వారా పౌర సేవలు
1.07 కోట్ల పొదుపు ఖాతాలు

ఆదాబ్ సైబరాబాద్, హైదరాబాద్ : డిజిటల్ సేవలను విస్తరిస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను చివరి వ్యక్తి వరకు చేరవేయడంలో భారత తపాలా శాఖ కీలక పాత్ర పోషిస్తోందని తెలంగాణ సర్కిల్ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ డీఎస్‌వీఆర్ మూర్తి తెలిపారు. రాష్ట్రంలో ప్రతి నెలా సుమారు 20 లక్షల మంది చేయూత పింఛన్ లబ్ధిదారులకు తపాలా వ్యవస్థ ద్వారా సేవలందిస్తున్నామని, దాదాపు రూ.500 కోట్ల పింఛన్లను పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు.

ప్రపంచ తపాలా దినోత్సవం సందర్భంగా అక్టోబర్ 9 నుంచి 15 వరకు నిర్వహిస్తున్న జాతీయ తపాలా వారోత్సవాల్లో భాగంగా హైదరాబాద్‌లోని డాక్ సదన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ఒకే తపాలా వ్యవస్థ.. అపరిమిత అవకాశాలు' అనే ఇతివృత్తంతో ప్రజలకు సాంకేతికత ఆధారిత సేవలను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు.

దేశంలోనే అతిపెద్ద తపాలా వ్యవస్థ

దేశవ్యాప్తంగా 1,64,999 తపాలా కార్యాలయాలతో ఇండియా పోస్ట్ ప్రపంచంలోనే అతిపెద్ద తపాలా వ్యవస్థగా కొనసాగుతోందని మూర్తి వివరించారు. వీటిలో 1,49,385 కార్యాలయాలు గ్రామీణ ప్రాంతాల్లోనే ఉన్నాయని తెలిపారు. తెలంగాణ సర్కిల్ పరిధిలో 36 ప్రధాన పోస్టాఫీసులు, 759 ఉప తపాలా కార్యాలయాలు, 5,424 శాఖా తపాలా కార్యాలయాలు పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. ఈ వ్యవస్థ ద్వారా 6,514 మంది శాఖా ఉద్యోగులు, 10,623 మంది గ్రామీణ డాక్ సేవకులు ప్రజలకు సేవలందిస్తున్నారని చెప్పారు.

ఉపాధి కల్పనలో భాగంగా 17 విడతల రోజ్‌గార్ మేళాల ద్వారా దేశవ్యాప్తంగా 1,86,202 నియామక పత్రాలు అందజేయగా, వీరిలో 1,51,348 మంది గ్రామీణ డాక్ సేవకులు ఉన్నారని తెలిపారు. తెలంగాణ సర్కిల్ పరిధిలో 1,123 మంది గ్రామీణ డాక్ సేవకులతో సహా మొత్తం 1,272 మంది అభ్యర్థులు ఉద్యోగాలు పొందారని వెల్లడించారు.

సాంకేతికతతో వేగవంతమైన సేవలు

తపాలా సేవలను ఆధునికీకరించడంలో భాగంగా స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన ఏపీటీ 2.0 వేదికను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు మూర్తి తెలిపారు. ఐఐటీ హైదరాబాద్, ఇస్రోకు చెందిన జాతీయ రిమోట్ సెన్సింగ్ కేంద్రం సహకారంతో అభివృద్ధి చేసిన డిజిపిన్ ద్వారా పది అక్షరాలతో కూడిన జియోకోడ్ ఆధారిత డిజిటల్ చిరునామా వ్యవస్థను అందిస్తున్నామని చెప్పారు.

డోర్‌స్టెప్ సర్వీస్ అప్లికేషన్ ద్వారా పార్శిళ్ల డెలివరీలను ట్రాక్ చేసే సదుపాయం కల్పించినట్లు వివరించారు. 2026 మార్చి 17న హైదరాబాద్‌లో ప్రారంభించిన 24 స్పీడ్ పోస్ట్, 48 స్పీడ్ పోస్ట్ సేవల ద్వారా ఇప్పటివరకు 1.33 లక్షలకు పైగా వస్తువులను నమోదు చేసినట్లు తెలిపారు. 94 పిన్‌కోడ్ ప్రాంతాల్లో నిర్దిష్ట గడువులో డెలివరీ సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. పోస్టాఫీసు కౌంటర్లలో యూపీఐ, కార్డు చెల్లింపులతో పాటు క్యాష్ ఆన్ డెలివరీ సేవలు కూడా అందుబాటులో ఉన్నాయని వివరించారు.

ఆధార్, పాస్‌పోర్టు సేవల్లో పురోగతి

తెలంగాణలోని 14 పోస్టాఫీసు పాస్‌పోర్టు సేవా కేంద్రాల ద్వారా 2025--26 ఆర్థిక సంవత్సరంలో 1,66,478 పాస్‌పోర్టు లావాదేవీలు నిర్వహించగా, 2026 సెప్టెంబర్ వరకు మరో 87,100 లావాదేవీలు నమోదయ్యాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 263 ఆధార్ కేంద్రాల ద్వారా 2025--26లో 4,75,592 లావాదేవీలు, 2026 సెప్టెంబర్ వరకు 3,17,146 లావాదేవీలు నిర్వహించినట్లు వెల్లడించారు. స్వయం సహాయక సంఘాల రుణ చెల్లింపుల సేకరణలో స్ట్రీనిధికి సహకరిస్తున్నామని, 'హోలీ బ్లెస్సింగ్' కార్యక్రమం ద్వారా భక్తులకు ప్రసాదాలను ఇంటివద్దకే చేరవేస్తున్నామని చెప్పారు.

ఆర్థిక సమ్మిళిత్వానికి ప్రాధాన్యం

2026 మార్చి 31 నాటికి తెలంగాణ పోస్టల్ సర్కిల్ పరిధిలో 1.07 కోట్ల క్రియాశీల పోస్టాఫీసు పొదుపు బ్యాంకు ఖాతాలు ఉన్నాయని మూర్తి తెలిపారు. 2026--27 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి గ్రామీణ జనాభాలో 25 శాతం మందిని ఆర్థిక సమ్మిళిత్వ పరిధిలోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. కనీసం 10 శాతం పొదుపు ఖాతాలను డిజిటల్ లావాదేవీల దిశగా మళ్లించడంతో పాటు ఇంటర్నెట్, మొబైల్ బ్యాంకింగ్ సేవలను ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు.

పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ పథకాల ద్వారా బీమా రక్షణ కల్పిస్తున్నామని తెలిపారు. 2025--26లో తెలంగాణ సర్కిల్ 71,233 కొత్త బీమా పాలసీలను విక్రయించి రూ.590.13 కోట్ల ప్రీమియం వసూలు చేసిందని వెల్లడించారు. అదే ఆర్థిక సంవత్సరంలో రూ.661.88 కోట్ల ఆదాయ లక్ష్యానికి గాను రూ.596.71 కోట్ల ఆదాయం సాధించామని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సెప్టెంబర్ నాటికి రూ.322.28 కోట్ల ఆదాయం నమోదైందని పేర్కొన్నారు.

జాతీయ తపాలా వారోత్సవాల్లో భాగంగా తపాలా సేవలపై ప్రజలకు అవగాహన కల్పించే పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ లేఖా రచన పోటీ--2026లో తెలంగాణ సర్కిల్ తరఫున విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు.

దోమ పాఠశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు.

విద్యార్థినులు తయారు చేసిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణ.
ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు.
ప్రధానోపాధ్యాయుడు ఆంజనేయులు గౌడ్ సారథ్యంలో.

ఆదాబ్ సైబరాబాద్. పరిగి. వికారాబాద్ జిల్లా దోమ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థినులు, ఉపాధ్యాయులు కలిసి బతుకమ్మ సంబరాలను ఉత్సాహంగా జరుపుకున్నారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థినులు తరగతికి రెండు చొప్పున అందమైన బతుకమ్మలను తయారు చేసి వేడుకల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో బతుకమ్మ పండుగకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. తెలంగాణకు ప్రత్యేకమైన పూల పండుగగా, మహిళల పండుగగా బతుకమ్మ ప్రసిద్ధి చెందిందని పేర్కొన్నారు. పాఠశాలలో నిర్వహించిన ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో మన సంప్రదాయాల పట్ల అవగాహన పెరగడంతోపాటు, ఐక్యతా భావం బలపడుతుందని తెలిపారు. విద్యార్థినులు ఎంతో సంతోషంగా, చక్కగా బతుకమ్మలను తయారు చేయడం అభినందనీయమన్నారు.అందంగా బతుకమ్మలను రూపొందించిన విద్యార్థినులకు ప్రధానోపాధ్యాయుడు బహుమతులను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దోమ పాఠశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

గిన్నిస్ వరల్డ్ రికార్డులో డా.గోపీ కృష్ణ ప్రతిభ
కరాటే కటాను 20 నిమిషాల్లో 40 సార్లు ప్రదర్శన
అభినందించిన కూకట్‌పల్లి సీఐ విజయ్ కుమార్

ఆదాబ్ సైబరాబాద్, హైదర్‌నగర్: నిజాంపేట్ రోడ్డులోని కుంగ్‌ఫూ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకుడు గ్రాండ్ మాస్టర్ డా. టి. గోపీ కృష్ణ మార్షల్ ఆర్ట్స్‌లో తన ప్రతిభను చాటుకున్నారు. గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ అధికారిక రికార్డు ప్రయత్నంలో భాగంగా కరాటే కటాను కేవలం 20 నిమిషాల్లో 40 సార్లు ప్రదర్శించి ప్రత్యేక గుర్తింపు పొందారు.2026 ఏప్రిల్ 26న హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీనియర్ మాస్టర్స్ విభాగంలో ఆయన ఈ ప్రదర్శన ఇచ్చారు. ఈ అధికారిక రికార్డు ప్రయత్నానికి సంబంధించిన సర్టిఫికెట్, పతకాన్ని సెప్టెంబర్ నాలుగో వారంలో అందుకున్నారు.

ఈ నేపథ్యంలో గ్రాండ్ మాస్టర్ డా. టి. గోపీ కృష్ణ కూకట్‌పల్లి కాలనీ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి. విజయ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ అధికారిక ప్రయత్నానికి సంబంధించిన సర్టిఫికెట్, పతకాన్ని ఆయనకు చూపించారు. ఈ సందర్భంగా గోపీ కృష్ణ సాధించిన ఘనతను సీఐ విజయ్ కుమార్ అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

మార్షల్ ఆర్ట్స్ రంగంలో గోపీ కృష్ణ చేస్తున్న సేవలు, రికార్డు ప్రయత్నంలో ఆయన ప్రదర్శించిన ప్రతిభ యువతకు, మార్షల్ ఆర్ట్స్ అభ్యాసకులకు స్ఫూర్తిదాయకమని విజయ్ కుమార్ పేర్కొన్నారు. కఠోర సాధన, పట్టుదల, క్రమశిక్షణతో లక్ష్యాలను చేరుకోవచ్చని ఆయన ప్రయాణం తెలియజేస్తోందన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

దిశా కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

ఆదాబ్ సైబరాబాద్, మేడ్చల్--మల్కాజిగిరి : కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అధికారులను కోరారు. అంతాయిపల్లిలోని జిల్లా కలెక్టరేట్‌లో ఎంపీ ఈటల రాజేందర్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన దిశా కమిటీ సమావేశంలో ఆయన పలు సమస్యలను ప్రస్తావించారు.

మహిళా సంఘాలకు తక్కువ వడ్డీ రుణాలు, మల్కాజిగిరిలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు, ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సదుపాయాల పెంపు, రేషన్ సరుకుల సక్రమ పంపిణీ, అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాలు, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలని, చెరువుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి, ఎమ్మెల్యేలు చామకూర మల్లారెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు

హైడ్రా పేరుతో వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు!

డబ్బులు అడిగితే నమ్మొద్దు.. ఏసీబీ, పోలీసులకు ఫిర్యాదు చేయండి

ఆదాబ్ సైబరాబాద్, హైదరాబాద్: హైడ్రా పేరుతో ప్రజలను బెదిరిస్తూ డబ్బులు వసూలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హైడ్రా స్పష్టం చేసింది. ఇలాంటి ఘటనలు ఎదురైతే వెంటనే హైడ్రా, అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కార్యాలయాలతో పాటు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో సూచించింది. హైడ్రా పేరుతో కొందరు వ్యక్తులు ప్రజలను భయపెట్టి డబ్బులు వసూలు చేస్తున్నారంటూ సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలు, తమకు అందిన ఫిర్యాదుల నేపథ్యంలో ఈ ప్రకటన విడుదల చేసింది. హైడ్రా పేరు చెప్పి ఎవరైనా డబ్బులు అడిగితే వారి మాటలు నమ్మి ఎలాంటి చెల్లింపులు చేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేసింది. అక్రమ కట్టడాలు, అనుమతులు లేని నిర్మాణాలపై హైడ్రా నేరుగా చర్యలు తీసుకోదని స్పష్టం చేసింది. జీహెచ్ఎంసీ, సీఎంసీ, ఎంఎంసీల విజ్ఞప్తి మేరకు ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ప్రమాదకర భవనాలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించింది. కూలిపోయే స్థితిలో ఉండి ప్రజల ప్రాణాలకు ప్రమాదకరంగా మారిన భవనాల విషయంలో హైడ్రా జోక్యం చేసుకుంటుందని తెలిపింది. ఇలాంటి భవనాల్లో హాస్టళ్ల నిర్వహణ చేపట్టరాదని ఇప్పటికే సూచించినట్లు గుర్తు చేసింది. హాస్టళ్లను సురక్షితమైన భవనాల్లోకి మార్చేందుకు డిసెంబర్ 31వ తేదీ వరకు గడువు ఇచ్చినట్లు పేర్కొంది. హైడ్రా పేరు చెప్పి డబ్బులు వసూలు చేయడానికి ప్రయత్నించే వ్యక్తుల వివరాలను సంబంధిత అధికారులకు తెలియజేయాలని ప్రజలకు సూచించింది. అనుమానాస్పద వ్యక్తుల బెదిరింపులకు భయపడకుండా అధికారిక మార్గాల్లో ఫిర్యాదు చేయాలని కోరింది.

ఫిర్యాదుల కోసం సంప్రదించాల్సిన నంబర్లు:
- ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్: 1064
- హైడ్రా కంట్రోల్ రూమ్ టోల్‌ఫ్రీ నంబర్: 1070

సేవా సంకల్ప్ అభియాన్‌లో విద్యార్థుల ప్రతిభకు ప్రోత్సాహం.

పరిగి శ్రీ సరస్వతీ శిశు మందిర్‌లో వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు.

ఆదాబ్ సైబరాబాద్. పరిగి. సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా వికారాబాద్ జిల్లా పరిగి పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ హైస్కూల్‌లో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సృజనాత్మక ప్రతిభను ప్రదర్శించారు.

విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంతో పాటు దేశభక్తి, సామాజిక బాధ్యత, సేవాభావంపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాలు నిర్వహించినట్లు జిల్లా సేవా సంకల్ప్ అభియాన్ కో-కన్వీనర్ జి. అనూష తెలిపారు. విద్యార్థులు విద్యతో పాటు సామాజిక విలువలను

అలవర్చుకోవాలని ఆమె సూచించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జిల్లా స్థాయిలో బహుమతులు అందజేయనున్నట్లు అనూష వెల్లడించారు. ఇలాంటి పోటీలు విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడంతో పాటు ఆత్మవిశ్వాసాన్ని, పోటీతత్వాన్ని అభివృద్ధి చేసేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షుడు రాచూరి శ్రీనివాస్ రెడ్డి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు బాలకృష్ణారెడ్డి, పాఠశాల ప్రధానాచార్యుడు కె. మల్లేష్, ఆచార్యులు, మాతాజీలు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో దేశభక్తి, సేవాభావం పెంపొందించాలి

జెడ్పీహెచ్ఎస్ నం. 1 పాఠశాలలో సేవా సంకల్ప అభియాన్. వికారాబాద్ జిల్లా కో కన్వీనర్ అనూష బాబ్జి.

ఆదాబ్ సైబరాబాద్. పరిగి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం, 25 ఏళ్ల సేవా సమర్పణను పురస్కరించుకుని పరిగిలోని జెడ్పీహెచ్ఎస్ నం. 1 పాఠశాలలో సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు, ఉపన్యాస కార్యక్రమాలు నిర్వహించి వారిలోని ప్రతిభను ప్రోత్సహించారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, వక్తృత్వ నైపుణ్యాలతో పాటు దేశభక్తి, సేవాభావం, సామాజిక

బాధ్యతను పెంపొందించడమే కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. విద్యార్థి దశ నుంచే సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని, సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరించాలని నిర్వాహకులు సూచించారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు నాయకత్వ లక్షణాలు, సామాజిక స్పృహను అభివృద్ధి చేసేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు

. ఈ కార్యక్రమంలో జిల్లా కో-కన్వీనర్ జి. అనూష బాబ్జీ, బీజేపీ కార్యకర్త లక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపాల్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. వారి సహకారంతో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు

కళ్యాణ లక్ష్మి, షాది ముభారాక్ చెక్కులు

పంపిణీ చేసిన ములుగు జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి రాష్ట్ర మంత్రి వర్యులు దనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు , జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచనలతో

ఆదాబ్ సైబరాబాద్,ములుగు, ములుగు జిల్లాలోని తాడ్వాయి మండలానికి చెందిన సుమారు 24 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాది ముభారాక్ చెక్కులను తాడ్వాయి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంకిడి నరసింహ స్వామి ఆధ్వర్యంలో ములుగు జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి పంపిణీ చేశారుఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళ్యాణ లక్ష్మి షాది ముభారాక్ వల్ల ప్రతి కుటుంబానికి ఒక వరంలా మారిందని అన్నారు..ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డ నాటి నుండి తాడ్వాయి మండలంలో అనేక అభివృద్ధి పనులను మంత్రి సీతక్క సహకారంతో జరుగుతున్నాయని ప్రజా ప్రభుత్వం

అందిస్తున్న సంక్షేమ పథకాల వల్ల ప్రజలు చాలా సంతోషంగా ఉన్నారని అన్నారు. ఈకార్యక్రమంలో ఎమ్మార్వో సురేష్ బాబు , ఎంపిడిఓ తేజ తాడ్వాయి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంకిడి నరసింహ స్వామి , కామారం సర్పంచ్ కోర్నబెల్లి సావిత్రి , నార్లపూర్ సర్పంచ్ తోలెం కృష్ణ , అంకంపల్లి సర్పంచ్ ఇర్ప వెంకటేశ్వర్లు , దామరవాయి సర్పంచ్ వట్టం తిరుపతయ్య , మల్లూరు లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ డైరెక్టర్ పల్నాటి సత్యం , యూత్ కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శనిగరపు చిరంజీవి , మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు

మానసిక ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే 5 పోషక లోపాలు.. ఈ లక్షణాలను అస్సలు నిర్లక్ష్యం చేయొద్దు

మానసిక ఆరోగ్యంపై ఒత్తిడి, నిద్ర, హార్మోన్లు, పోషకాహారం వంటి అనేక అంశాలు ప్రభావం చూపుతాయి. తరచూ మూడ్‌లో మార్పులు, ఏకాగ్రత లోపించడం లేదా నిద్రకు సంబంధించిన సమస్యలు కనిపిస్తే, వాటి వెనుక ఏదైనా ఆరోగ్య సమస్య ఉండే అవకాశం ఉంటుంది. అందువల్ల ఎక్కువ కాలం కొనసాగే లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా అవసరమైనప్పుడు వైద్య సలహా తీసుకోవడం చాలా ముఖ్యం. పోషకాహార నిపుణురాలు దీపశిఖా జైన్ పోషకాల లోపాలు, మానసిక ఆరోగ్యం మధ్య ఉండే సంబంధాన్ని వివరించారు. కొన్ని విటమిన్లు, ఖనిజాల స్థాయిలు తక్కువగా ఉండడం వల్ల ఆందోళన, తక్కువ మూడ్, బ్రెయిన్ ఫాగ్, నిద్రలేమి, చిరాకు వంటి లక్షణాలతో సంబంధం ఉంటుందని ఆమె పేర్కొన్నారు. ఆందోళన, డిప్రెషన్..

తరచూ ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వాటిని నిర్లక్ష్యం చేయవద్దని దీపశిఖా జైన్ సూచించారు. అవసరమైన పోషకాల స్థాయిలను పరీక్షించుకుని, లోపాలు ఉన్నట్లు గుర్తిస్తే వాటిని సరిదిద్దే దిశగా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఆమె వివరించిన లక్షణాల్లో మొదటిది ఆందోళన. మెగ్నిషియం, విటమిన్ బి6 స్థాయిలు తక్కువగా ఉండడం ఆందోళన భావనలతో సంబంధం కలిగి ఉంటుందని దీపశిఖా జైన్ చెప్పారు. అయితే ఆందోళనకు అనేక కారణాలు ఉంటాయని, పోషకాల లోపం వాటిలో ఒక కారణం మాత్రమే అవుతుందని గుర్తుంచుకోవాలి. రెండోది డిప్రెషన్. డిప్రెషన్ గురించి మాట్లాడుతూ విటమిన్ డి3, విటమిన్ బి12 లోపాలతో పాటు పేగుల్లోని సమతుల్యతలో మార్పులను కూడా పరిగణనలోకి తీసుకోవచ్చని ఆమె పేర్కొన్నారు. బ్రెయిన్ ఫాగ్, నిద్రలేమి, చిరాకు..

మూడోది బ్రెయిన్ ఫాగ్. ఏకాగ్రత కుదరకపోవడం, స్పష్టంగా ఆలోచించడంలో ఇబ్బంది పడడం వంటి లక్షణాలను బ్రెయిన్ ఫాగ్‌గా పేర్కొంటారు. తక్కువ ఈస్ట్రోజెన్ స్థాయిలు, విటమిన్ బి12 లోపం, ఒమెగా 3 తక్కువగా తీసుకోవడం వంటి అంశాలు ఈ లక్షణాలతో సంబంధం కలిగి ఉంటాయని పోషకాహార నిపుణురాలు తెలిపారు. నాలుగోది నిద్రలేమి. నిద్రకు సంబంధించిన సమస్యల విషయంలో మెగ్నిషియం, మెలటోనిన్, విటమిన్ బి12 స్థాయిలతో సంబంధం ఉండే అవకాశం ఉందని ఆమె వివరించారు. ఐదోది తరచూ చిరాకు రావడం. తరచూ చిరాకు లేదా మూడ్‌లో మార్పులు కనిపించడానికి తక్కువ ఈస్ట్రోజెన్ స్థాయిలు, విటమిన్ బి12 లోపం, మెగ్నిషియం స్థాయిలు వంటి అంశాలు సంబంధం కలిగి ఉంటాయని దీపశిఖా జైన్ పేర్కొన్నారు. అయితే ఈ లక్షణాలు కనిపించాయని మాత్రమే విటమిన్ లేదా ఇతర పోషకాల లోపం ఉన్నట్లు నిర్ధారించలేరు. ఆందోళన, డిప్రెషన్, నిద్ర సమస్యలు లేదా మానసిక ఆరోగ్యంలో ఇతర మార్పులు నిరంతరం కొనసాగుతున్నట్లయితే, సరైన పరీక్షలు, వైద్యపరమైన అంచనా కోసం ఆరోగ్య నిపుణులను సంప్రదించడం అవసరం.

ఎమ్మెల్యేపై దుష్ప్రచారం చేస్తే సహించేది లేదు!

మాజీ వైస్ ఎంపీపీ గజ్జి రామకృష్ణ యాదవ్

ఆదాబ్, సైబరాబాద్, యాచారం : ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి బస్సులో ప్రయాణిస్తూ ప్రజలతో మాట్లాడిన దృశ్యాలను వక్రీకరించి సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేయడం సరికాదని యాచారం మండల కాంగ్రెస్ పార్టీ మాజీ వైస్ ఎంపీపీ గజ్జి రామకృష్ణ యాదవ్ అన్నారు. బొంగ్లూర్ గేటు వద్ద ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తూ ఎమ్మెల్యే ప్రజల కష్టసుఖాలు తెలుసుకున్నారని తెలిపారు. ఈ ఘటనను రాజకీయంగా వక్రీకరించి ట్రోలింగ్ చేయడం తగదన్నారు. విమర్శలు చేయాలనుకుంటే ప్రజా సమస్యలు, అభివృద్ధిపై మాట్లాడాలని హితవు పలికారు. తమ నాయకుడిపై తప్పుడు ప్రచారం చేస్తే సహించేది లేదని, ప్రజలే తగిన బుద్ధి చెబుతారని ప్రతిపక్ష నాయకులను హెచ్చరించారు.

పరిగి సంకల్ప విద్యాపీఠంలో సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమం.

వికారాబాద్ జిల్లా కో కన్వీనర్ అనూష బాబ్జి.

ఆదాబ్ సైబరాబాద్. పరిగి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం, 25 ఏళ్ల సేవా సమర్పణను పురస్కరించుకుని పరిగిలోని సంకల్ప విద్యాపీఠంలో సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు, ఉపన్యాస కార్యక్రమాలు నిర్వహించి వారిలోని ప్రతిభను వెలికితీశారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను ప్రోత్సహించడంతో పాటు వక్తృత్వ నైపుణ్యాలు, సేవాభావం, దేశభక్తి, సామాజిక బాధ్యతను పెంపొందించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు పేర్కొన్నారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో-కన్వీనర్ జి. అనూష బాబ్జీ, బీజేపీ కార్యకర్త లక్ష్మి, పాఠశాల ప్రిన్సిపాళ్లు అశోక్ కుమార్, శివకుమార్‌తో పాటు సంకల్ప విద్యాపీఠం ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. విద్యార్థుల్లో సేవా దృక్పథం, నాయకత్వ లక్షణాలు, దేశభక్తి, సామాజిక స్పృహను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు. విద్యార్థులు విద్యతో పాటు సమాజం పట్ల బాధ్యతను అలవర్చుకుని భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు.

ఆటో ఒరిజినల్ పత్రాలు లభిస్తే సమాచారం ఇవ్వండి

ఆదాబ్ సైబరాబాద్. పరిగి. ఆటోకు సంబంధించిన ఒరిజినల్ పత్రాలు పోగొట్టుకున్నానని, అవి ఎవరికైనా లభిస్తే సమాచారం అందించి సహకరించాలని బొంరాస్‌పేట్ మండలం ఎరుపుమల్ల గ్రామానికి చెందిన బోయిని శ్రీను కోరారు. గత నెల 29వ తేదీన తుంకిమెట్ల గ్రామ సమీపంలో తన రెండు ఆటోలకు సంబంధించిన ఒరిజినల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు (ఆర్‌సీ), పర్మిట్, ఎన్ఓసీ పత్రాలు ప్రమాదవశాత్తు జారిపడిపోయినట్లు ఆయన తెలిపారు. TS 34 TB 4934, TS 34 T 9306 రిజిస్ట్రేషన్ నంబర్లు కలిగిన ఆటోలకు సంబంధించిన ఈ పత్రాలు ఎవరికైనా లభిస్తే మానవత్వంతో స్పందించి 9666728278 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని బాధితుడు విజ్ఞప్తి చేశారు.

బరువు తగ్గాలంటే ప్రొటీనా? ఫైబరా? అసలు నిజం ఇదే!

బరువు నియంత్రణకు ఉపయోగపడే చిట్కాలు ఇంటర్నెట్‌లో ఎన్నో కనిపిస్తుంటాయి. కొందరు ఆహారంలో ఫైబర్‌ను పెంచాలని సూచిస్తే, మరికొందరు రోజువారీ ప్రొటీన్ అవసరాలను పూర్తి చేయడం తప్పనిసరి అని చెబుతుంటారు. అయితే నిజానికి ప్రొటీన్, ఫైబర్ రెండూ కడుపు నిండిన అనుభూతిని కలిగించడంలో, కొవ్వు తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. సంతృప్తి అనేది శరీరంలో జరిగే సంక్లిష్టమైన శారీరక ప్రతిస్పందన. మనం తీసుకునే మాక్రోన్యూట్రియెంట్లు సహా అనేక అంశాలు దీనిని ప్రభావితం చేస్తాయి. కడుపు నిండిన అనుభూతి కలిగినప్పుడు అవసరానికి మించి తినే అవకాశం తగ్గుతుంది. ఎక్కువసేపు సంతృప్తిగా ఉంచే ఆహారాలు ఆకలిని నియంత్రించడంతోపాటు అవసరం లేని కేలరీల తీసుకోవడం తగ్గించి బరువు నియంత్రణ, కొవ్వు తగ్గింపులో సహాయపడతాయి. ప్రొటీన్ పాత్ర ఏమిటి? బరువు తగ్గడంలో ప్రొటీన్‌కు ఉన్న ప్రాధాన్యత అందరికీ తెలిసిందే. ఇది కండరాల మరమ్మత్తు, పెరుగుదలకు అవసరమైన పోషక పదార్థం మాత్రమే కాదు, అధిక థర్మిక్ ఎఫెక్ట్ కూడా కలిగి ఉంటుంది. అంటే కొవ్వులు లేదా కార్బొహైడ్రేట్లతో పోలిస్తే ప్రొటీన్‌ను జీర్ణం చేయడానికి శరీరం ఎక్కువ కేలరీలను ఖర్చు చేస్తుంది. ప్రొటీన్ అధికంగా ఉండే ఆహారాలను తీసుకోవడం వల్ల ఎక్కువసేపు కడుపు నిండిన అనుభూతి ఉంటుంది. ఆకలిని నియంత్రించే ఘ్రెలిన్, పెప్టైడ్ వైవై వంటి హార్మోన్ల విడుదలను ప్రొటీన్ ప్రభావితం చేయడం దీనికి ఒక కారణం. తగినంత ప్రొటీన్ తీసుకున్నప్పుడు ఆకలి, తినాలనే కోరికలు తగ్గే అవకాశం ఉంటుంది. దీంతో ఆహారంలో కేలరీలను తగ్గించినా తీవ్రమైన ఆకలి అనుభూతి లేకుండా ఆహార నియమాలను పాటించడం సులభమవుతుంది. ఫైబర్ పాత్ర ఏమిటి? పండ్లు, కూరగాయలు, ధాన్యాలు, పప్పుధాన్యాలు వంటి మొక్కల ఆధారిత ఆహారాల్లో లభించే ఫైబర్ కూడా సంతృప్తిని కలిగించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ప్రొటీన్‌కు భిన్నంగా ఫైబర్‌ను శరీరం పూర్తిగా జీర్ణం చేసి గ్రహించదు. అది జీర్ణవ్యవస్థ ద్వారా దాదాపు అలాగే ప్రయాణిస్తుంది. ఈ ప్రక్రియ అనేక విధాలుగా కడుపు నిండిన అనుభూతిని కలిగిస్తుంది. మొదటగా, ఫైబర్ ఆహారానికి పరిమాణాన్ని పెంచుతుంది. దీంతో అధిక కేలరీలు తీసుకోకుండానే కడుపు నిండిన భావన కలుగుతుంది. రెండోది, ఇది కార్బొహైడ్రేట్ల జీర్ణక్రియను నెమ్మదిస్తుంది. ఫలితంగా రక్తంలో చక్కెర స్థాయిలు స్థిరంగా ఉండడానికి సహాయపడుతుంది. ఆకస్మికంగా చక్కెర స్థాయిలు పెరగడం, తద్వారా త్వరగా ఆకలి వేయడం వంటి పరిస్థితులను కూడా ఇది తగ్గిస్తుంది. ముఖ్యంగా కరిగే ఫైబర్‌లో కొన్ని రకాలు జీర్ణవ్యవస్థలో జెల్‌లాంటి పదార్థాన్ని ఏర్పరుస్తాయి. ఇది మరింత ఎక్కువసేపు కడుపు నిండిన అనుభూతిని కలిగించడంలో సహాయపడుతుంది. ఓట్స్, చియా విత్తనాలు, బీన్స్ వంటి ఆహారాలు కరిగే ఫైబర్‌కు మంచి వనరులు. అందువల్ల బరువు తగ్గాలనుకునే వారి ఆహారంలో వీటిని సులభంగా చేర్చుకోవచ్చు. బరువు తగ్గడానికి ఏది ఉత్తమం? ప్రొటీన్, ఫైబర్ రెండింటికీ సంతృప్తి, కొవ్వు తగ్గింపులో ప్రత్యేకమైన ప్రయోజనాలు ఉన్నాయి. అయితే వీటిలో ఒకదానిని ఎంచుకోవడం కంటే రెండింటినీ కలిపి తీసుకోవడం మరింత ప్రయోజనకరం. ఫైబర్ లేకుండా కేవలం ప్రొటీన్ తీసుకుంటే ఆహారం వల్ల లభించే సంపూర్ణత, జీర్ణవ్యవస్థకు అవసరమైన ప్రయోజనాలు తగ్గుతాయి.

EDITOR PRINTER AND PUBLISHER OWNED BY BILLALPURSARA SHIVA KUMAR, PRINTING AT RIYAZ PRINTING PRESS, S NO 22-8-161, BEHIND NAYAAB HOTEL, CHATTA BAZAR, HYDERABAD, TELANGANA - 500002 AND PUBLISHED FROM H.NO: 2-1-602, TARAKARAMA NAGAR, YELLAMMABANDA, KUKATPALLY, MEDCHEL- MALKAJGIRI DIST, TELANGANA-500 072. PRGI: TGTEL/26/A4985. PHONE NO: +91 8686861338, +91 81215 50907 EMAIL : shivakumarlal@gmail.com

ఇక నుంచి కేటీఆర్ మమ్మల్ని గోకకపోయినా.. నేను గోకుతూనే ఉంటా!

హైదరాబాద్ : కేటీఆర్ బాగోతాలను ప్రతీ వారం సీరియల్‌లా బయటపెడతానన్న వెంకట్ బల్మూర్ ఆయన ఇంటికి, పార్టీ ఆఫీసుకు 'గోకుడు మందు' పంపిస్తున్నట్లు వెల్లడి డెక్కన్ సెరాయ్ హోటల్ వ్యాపారంపై విచారణ జరపాలని డిమాండ్ ఓ సినీ నటితో చేసిన చాటింగ్‌ను కేటీఆర్ ఎందుకు డిలీట్ చేశారని ప్రశ్నకేసీఆర్, కేటీఆర్ మధ్య మాటలు లేవని, మధ్యవర్తిత్వం జరుగుతోందని వ్యాఖ్యబీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ప్రభుత్వ విప్ వెంకట్ బల్మూర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేటీఆర్ వ్యవహారశైలిపై సంచలన ఆరోపణలు చేసిన ఆయన, ఇకపై ప్రతీ వారం ఒక సీరియల్ లాగా ఆయన బాగోతాలను బయటపెడతానని హెచ్చరించారు. "ఇక నుంచి కేటీఆర్ మమ్మల్ని గోకకపోయినా, నేను గోకుతూనే ఉంటా'' అని వ్యాఖ్యానించిన బల్మూర్, కేటీఆర్ ఇంటికి, పార్టీ ఆఫీసుకు 'గోకుడు మందు' (ఇచ్ గార్డ్) పంపిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా వెంకట్ బల్మూర్ మాట్లాడుతూ.. తాము కేటీఆర్ బాగోతాలు బయటపెడితే, బీఆర్ఎస్ నేతలు తమ ముఖ్యమంత్రిపై సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టిస్తున్నారని ఆరోపించారు. 2019 నుంచి 2022 మధ్య ఓ సినీ నటితో జరిపిన సోషల్ మీడియా సంభాషణలను కేటీఆర్ ఎందుకు డిలీట్ చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. కేటీఆర్ హోటల్ వ్యాపార రహస్యాలు ప్రజల ముందు ఉంచాలన్నారు. "2015లో రూ.5 కోట్లుగా ఉన్న డెక్కన్ సెరాయ్ హోటల్ షేర్ విలువ, పదేళ్లలో రూ.175 కోట్లకు ఎలా పెరిగింది? ఈ అంశంపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసి విచారణ కోరతాం" అని స్పష్టం చేశారు. ఏ విచారణకైనా సిద్ధమని చెప్పే కేటీఆర్, పాస్‌పోర్ట్ సీజ్ చేయాలన్న పోలీసుల అభ్యర్థనపై కోర్టును ఎందుకు ఆశ్రయించారని బల్మూర్ ప్రశ్నించారు. కేటీఆర్ చెప్పేవి నీతి మాటలని, చేసేవి అవినీతి పనులని కేటీఆర్ ఎందుకు ఎవరితో కలవడం లేదో బీఆర్ఎస్ మిత్రులు కూడా ఆలోచించాలని ఆయన సూచించారు. అంతేకాకుండా, ఫాంహౌస్ లో కేటీఆర్ కు రహస్య ట్రీట్ మెంట్ అంటూ సంచలన ట్వీట్లు కూడా చేశారు. విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం డ్రగ్స్‌ను అరికట్టేందుకు కృషి చేస్తుంటే, కేటీఆర్ డ్రగ్స్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా మారుతున్నారని తీవ్ర ఆరోపణ చేశారు. తాను చెప్పేవన్నీ అబద్ధాలైతే కేటీఆర్ లైవ్‌లోకి వచ్చి వాస్తవాలు చెప్పాలని, డ్రగ్ టెస్టుకు సిద్ధమని ప్రకటించాలని సవాల్ విసిరారు. ప్రస్తుతం కేసీఆర్ కూడా కేటీఆర్‌తో మాట్లాడటం లేదని, తండ్రీకొడుకుల మధ్య పంచాయతీని నవీన్ రావు తండ్రి కొండల్ రావు పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నారని బల్మూర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అధికారులకు ఫిర్యాదు చేసి విచారణ కోరతాం" అని స్పష్టం చేశారు. ఏ విచారణకైనా సిద్ధమని చెప్పే కేటీఆర్, పాస్‌పోర్ట్ సీజ్ చేయాలన్న పోలీసుల అభ్యర్థనపై కోర్టును ఎందుకు ఆశ్రయించారని బల్మూర్ ప్రశ్నించారు. కేటీఆర్ చెప్పేవి నీతి మాటలని, చేసేవి అవినీతి పనులని కేటీఆర్ ఎందుకు ఎవరితో కలవడం లేదో బీఆర్ఎస్ మిత్రులు కూడా ఆలోచించాలని ఆయన సూచించారు. అంతేకాకుండా, ఫాంహౌస్ లో కేటీఆర్ కు రహస్య ట్రీట్ మెంట్ అంటూ సంచలన ట్వీట్లు కూడా చేశారు.

తెలంగాణలో 95 లక్షల ఓట్ల తొలగింపు వార్త అవాస్తవం: ఎన్నికల ప్రధానాధికారి

హైదరాబాద్, అక్టోబర్ 9:
తెలంగాణలో 95 లక్షల ఓట్లు తొలగింపు వార్త అవాస్తవమని ఎస్ఈసీ తెలిపారు. 95 లక్షల ఓట్లను తొలగించారంటూ వచ్చిన వార్తపై తెలంగాణ ఎన్నికల ప్రధానాధికారి వివరణ ఇచ్చారు. ఓటర్ల జాబితా సవరణపై తప్పుడు ప్రచారం జరుగుతోందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో 73,39,235 మంది ఓటర్లను మాత్రమే ఏఎస్‌డీడీ కేటగిరీలో గుర్తించినట్లు వెల్లడించారు. ఇప్పటివరకు 92,88,187 నోటీసులు జారీ చేశామని చెప్పారు. 92,23,486 మంది ఓటర్లకు నోటీసులు అందగా.. ఇంకా 64,701 నోటీసులను పంపిణీ చేయాల్సి ఉందన్నారు. ఇప్పటివరకు నోటీసులు అందుకున్న వారిని 82,11,205 మంది విచారణలు పూర్తి అయినట్లు ఎస్ఈసీ తెలిపారు. తుది ఓటర్ల జాబితాలో చోటు కల్పించేందుకు 74,62,851 మందిని అర్హులుగా గుర్తించామని.. అనర్హులుగా గుర్తించిన ఓటర్లు 12,969 మంది మాత్రమే అని తెలిపారు. మరో 18,12,367 మంది ఓటర్లపై నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. 2026, నవంబర్ 5 లోపు మిగిలిన నోటీసులపై నిర్ణయాలు తీసుకుంటామని వెల్లడించారు. ఓటర్ల జాబితాపై వచ్చిన వార్త వాస్తవాలకు దూరంగా ఉందన్న తెలంగాణ ఎన్నికల ప్రధానాధికారి పేర్కొన్నారు.

రైతులకు కరెంట్ ఇవ్వకుంటే నిరసన ఢిల్లీకి చేరుతుంది

సిద్దిపేట, అక్టోబర్ 9:
కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల గోడు వినిపించడం లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి విమర్శలు గుప్పించారు. (శుక్రవారం) అక్బర్‌పేట భూంపల్లి మండలం సిద్దిపేట - రామాయంపేట హైవేపై రైతులకు సరిపడా కరెంట్ సరఫరా చేయడం లేదంటూ బీఆర్ఎస్ నేతలు చేపట్టిన ధర్నాలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. రైతులతో కలిసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. ఓట్ల కోసం గ్రామాలలోకి వచ్చారని.. అధికారంలోకి వచ్చాక రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. రైతులు వేసిన వేల ఎకరాల పంట ఎండిపోతుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి చీమ కుట్టినట్టన్నా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూడవెల్లి వాగులో తాము నింపిన నీళ్లు ఇంకా ఉన్నాయని ఎమ్మెల్యే అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 18 గంటల పాటు కరెంట్ ఇవ్వకుంటే ఇక్కడ ప్రారంభమైన నిరసన ఢిల్లీకి చేరుకుంటుందని హెచ్చరించారు. నీళ్లు, కరెంటు కోసం ఎన్నో ఉద్యమాలు చేసి తెలంగాణను కూడా సాధించుకున్నామని గుర్తుచేశారు. గతంలో బీజేపీ హయాంలో దొడ్డు వడ్లు కొనుగోలు చేయమని చెబితే కేసీఆర్ ఆధ్వర్యంలో ఢిల్లీకి వెళ్లి పార్లమెంట్ ముందు నిరసన తెలిపామన్నారు. ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురిచేస్తే వారి కోసం తన పదవికి కూడా రాజీనామా చేస్తానని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి స్పష్టం చేశారు.

హైదరాబాద్‌లో రూ.50 వేల కోట్ల భూమిపై పెద్దల కన్ను - 286 ఎకరాలు రాజీతో కొట్టేసేందుకు కుట్ర

హైదరాబాద్ : చీమలు పెట్టిన పుట్టల్ని పాములు ఆక్రమించినట్లు పైసాపైసా కూడబెట్టి సామాన్యులు కొనుకున్న స్థలాలను బడా వ్యక్తులు సొంతం చేసుకునేందుకు కుయుక్తులు చేస్తున్నారు. రాజధాని హైదరాబాద్ నడిబొడ్డున రూ.వేల కోట్ల విలువైన భూములను కొట్టేసేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. ఇప్పటికే కొంతమంది ఇళ్లు నిర్మించుకుని నివసిస్తుండగా, వారిని సైతం బెదిరిస్తున్నారు. ఎలాంటి హక్కులు లేకుండా రాత్రికి రాత్రే ప్రహరీ నిర్మాణాలు చేపట్టి రూ.కోట్లు ఖర్చు పెట్టి ప్రభుత్వ వ్యవస్థలను అదుపులోకి తెచ్చుకున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఎప్పుడో దశాబ్దాల కింద ఇళ్ల స్థలాలను కొనుగోలు చేసిన మధ్య తరగతి ప్రజలు ఇప్పుడు రాజకీయ నేతల ఒత్తిడిలో నలిగిపోతున్నారు. ఈ భూ వ్యవహారంలో అధికార పార్టీ కీలక వ్యక్తి, ప్రతిపక్షంలో ఉన్న పలువురు నేతలు, పక్క రాష్ట్రానికి చెందిన వైఎస్సార్?సీపీ నేత ఒకరు సూత్రధారులుగా ఉన్నట్లు తెలిసింది. భాగ్యనగర్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీకి చెందిన 286 ఎకరాలను వివాదాస్పదం చేసి ప్రత్యామ్నాయ రిజిస్ట్రేషన్? డాక్యుమెంటు సృష్టించి భూమి హక్కులు పొందాలని చూస్తున్నారు. కోర్టుల పేరుతో తిప్పలు పెడుతున్నారు. ఇప్పటికే 22 ఎకరాలకు సంబంధించి మధ్యవర్తిత్వం ద్వారా సెటిల్‌మెంట్? అయినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం భాగ్యనగర్ హౌసింగ్ సొసైటీ సభ్యులు తమకు న్యాయం చేయాలంటూ ఆందోళనకు దిగారు. ఈ భూమి అసలు కథ ఇదీ హైదరాబాద్?లో నివేశన స్థలాల కోసం కొంతమంది చిరుద్యోగులు, మధ్య తరగతి ప్రజలు కలిసి 1961లో భాగ్యనగర్ హౌసింగ్ కో ఆపరేటివ్ సొసైటీని ఏర్పాటు చేసి దీని ఆధ్వర్యంలో కూకట్‌పల్లి సర్వే నం.1007లో 286 ఎకరాల భూమిని కొనుగోలు చేయడానికి నిర్ణయించుకున్నారు. దీనికి హక్కుదారు నవాబ్ రియాజ్ యార్ జంగ్ అనే వ్యక్తి నుంచి 1974లో కొనుగోలుకు సిద్ధమై వారి వారసుల నుంచి అగ్రిమెంట్ కూడా పొందారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో కొంత జాప్యం జరిగింది. చివరకు 1991 నుంచి 1998 మధ్య కాలంలో కోర్టు ద్వారా వారికి 70 ఎకరాలు, 50 ఎకరాలు, 25 ఎకరాలు, 22 ఎకరాల చొప్పున మొత్తం 167 ఎకరాలు రిజిస్టర్ అయ్యాయి. మిగిలిన 119 ఎకరాలను రిజిస్టర్ చేయలేదు. ఈ స్థలాల్లో కొంతమంది ఇప్పటికే తమ ఇళ్లను నిర్మించుకున్నారు. కొన్ని ఖాళీగా ఉన్నాయి. హైటెక్ సిటీ నిర్మాణంతో భూములకు రెక్కలుమాదాపూర్‌లో హైటెక్ సిటీ నిర్మాణంతో ఈ ప్రాంతంలో భూముల ధరలకు డిమాండ్ విపరీతంగా పెరిగింది. హైటెక్ సిటీకి అత్యంత సమీపంలో ఉన్న ఈ భూములపై కొంతమంది బడాబాబుల చూపు పడింది. సొసైటీ భూములను సొంతం చేసుకోవాలనే ఉద్దేశంతో ఫేక్? డాక్యుమెంట్లు సృష్టించారు. ఏపీకి చెందిన ఓ ప్రముఖ సిమెంట్ కంపెనీ అధినేత ఇందులో ముఖ్య పాత్ర పోషించాడు. జంగ్ తన భూమిని తన దగ్గర సర్వెంట్‌గా పని చేస్తున్న వలీమ్ అహ్మద్‌కు నోటి మాటగా బహుమతిగా ఇచ్చినట్లు, తిరిగి అతని నుంచే కొనుగోలు చేసినట్లు ఓ సాదా కాగితం బయటకు వచ్చింది. దాన్ని జంగ్ మనవడు హషీమ్ రిజిస్టర్ చేయించినట్లు అన్ రిజిస్టర్డ్ డాక్యుమెంట్ ఒకటి పుట్టింది.

ప్రతినెలా కమిషన్‌లు, ఆపై వడ్డీ వ్యాపారాలు - పారిశుద్ధ్య కార్మికులపై సూపర్‌వైజర్ల దందా

హైదరాబాద్: మనం ఆరోగ్యంగా ఉండేందుకు అనేక జాగ్రత్తలను పాటించాలి. మరీ ముఖ్యంగా మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. అయితే ఇంట్లో చెత్తను మనం శుభ్రపరిస్తే వీధుల్లోని చెత్తను పలువురు సఫాయి కార్మికులు నిత్యం తొలగిస్తున్నారు. వీరు నిత్యం రోడ్లను శుభ్రం చేస్తున్నారు. అయితే కొందరు సూపర్‌వైజర్లు మాత్రం వారి జేబులు కొడుతున్నారు. సఫాయి కార్మికుల కష్టాన్ని దోచుకుంటున్నారు. ఒక్కో కార్మికుడి నుంచి ప్రతి నెలా రూ. 1,000 వసూలు చేస్తున్నారు. రాజధానిలోని మూడు కార్పొరేషన్ల పరిధిలో దాదాపుగా 28 వేల మంది కార్మికులు ఉన్నారు. వారిలో సుమారు సగం మందికి పైగా ఇలా నెల వారి మామూళ్లు ఇవ్వాల్సి వస్తోంది. ఈ లెక్కన చూసుకుంటే సూపర్?వైజర్లు ప్రతినెలా సుమారు రూ.1.5 కోట్ల వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా పోగేసిన సొమ్ముతో వడ్డీ వ్యాపారాలు చేస్తున్నారు. అది కూడా రూ.5 వడ్డీకి ఇస్తున్న ట్లు తెలిసింది. సకాలంలో చెల్లిం చని కుటుంబాలను మా నసిక ంగా వేధి స్తున్నా రు. ఏటీఎం కార్డులతో ఖాతా లు ఖాళీతమ కింద పనిచేసే కార్మికుడు నెలకు రూ. 1000 కమీషన్‌గా ఇవ్వాలి. పైగా తీసుకున్న అప్పునకు ప్రతి నెలా వడ్డీ చెల్లించాలి. వీరు అప్పు ఇచ్చే సమయంలో ముందుగానే వారి నుంచి ఏటీఎం తీసుకుంటున్నారు. గడువు లోపు అసలు, వడ్డీ ఇవ్వకుంటే వారి నుంచి ముందుగా తీసుకున్న ఏటీఎం కార్డుతో వారి బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తున్నారు. ఆ నిబంధనే వారికి కలిసొచ్చింది పారిశుద్ధ్య కార్మికులు ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 2 వరకు విధుల్లో ఉండాలి. ఆపై సంబంధిత అధికారులు, సూపర్?వైజరు ఉదయం, మధ్యాహ్నం కార్మికుల ముఖ హాజరు తీసుకుంటారు. రోజుకు సగటున ఒక్కో కార్మికుడికి వేతనం రూ.550గా ఉంటుంది. అయితే రెండు, మూడు రోజులు విధులకు రాకపోతే దీనికి తగిన విధంగా జీతంలో కోత పడుతుంది. ఈ నిబంధనే సూపర్?వైజర్లకు కలిసొచ్చింది. దీనిలో భాగంగా కొందరు పని చేయకపోయినా హాజరు వేయడం, కొందరికి హాజరు నుంచి మినహాయింపు ఇవ్వడం, నకిలీ హాజరుతో పూర్తి జీతం ఇప్పిస్తామంటూ సూపర్ వైజర్లు కమీషన్లను సంప్రదాయంగా మార్చారు.

దసరాకు టీజీఎస్ఆర్టీసీ 7 వేల ప్రత్యేక బస్సులు.. 40శాతం అదనపు ఛార్జీలు

హైదరాబాద్, అక్టోబర్ 9: దసరా పండుగ నేపథ్యంలో విద్యా సంస్థలకు సెలవులు రావడంతో ప్రజలు సొంతూళ్ల బాట పట్టారు. దీంతో నగరంలోని బస్టాండ్లలో భారీగా రద్దీ నెలకొంది. జేబీఎస్, ఎంబీబీఎస్ బస్టాండ్లు ప్రయా ణికులతో కిటకిటలాడు తున్నాయి. దసరాకు ప్రయాణి కుల రద్దీ దృష్ట్యా (శుక్రవారం) నుంచి 7 వేల స్పెషల్ బస్సులను టీజీఎస్ఆర్టీసీ నడుపనుంది. ప్రత్యేక బస్సుల్లో 40 శాతం వరకు అదనపు ఛార్జీలను వసూలు చేయనున్నారు. కరీంనగర్ జోన్ నుంచి 3,533 స్పెషల్ బస్సులు, హైదరాబాద్ జోన్ నుంచి 2,155 ప్రత్యేక బస్సులు, గ్రేటర్ హైదరాబాద్ జోన్ నుంచి 1,312 స్పెషల్ సర్వీసులు నడవనున్నాయి. ఈనెల 9, 10, 16, 17 తేదీల్లో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అదనపు బస్సులను నడపాలని ఆర్టీసీ నిర్ణయించింది. తిరుగు ప్రయాణ రద్దీ దృష్ట్యా 25, 26 తేదీల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఎంజీబీఎస్, జేబీఎస్ సహా ప్రధాన ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను నడపనున్నారు. ప్రయాణికుల కోసం షెడ్స్, తాగునీరు, కుర్చీలు, మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేశారు. ఎంపిక చేసిన ప్రత్యేక బస్సుల్లో మాత్రమే 1.5 రెట్లు వరకు సవరించిన టికెట్ ధరలు ఉండనున్నాయి. ఇక, మహిళలకు మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం యథావిధిగా అమలులో ఉండనుంది.

రైతులకు సరిపడా విద్యుత్ అందించాలని బీఆర్ఎస్ శ్రేణుల నిరసన

సూర్యాపేట : రైతులకు వ్యవసాయానికి సరిపడా కరెంటు అందించాలని డిమాండ్ చేస్తూ తుంగతుర్తి మండల పరిధిలోని రావులపల్లి ఎక్స్ రోడ్ తండ వద్ద ఉన్న సబ్ స్టేషన్ ఎదుట బీఆర్ఎస్ శ్రేణులు నిరసన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా కరెంటు కోతలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితులు ఎదురయ్యాయని వాపోయారు. అసలే వర్షాకాలంలో వర్షాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతన్నకు, కరెంటు కోతలు మరింత ఇబ్బందులకు గురి చేస్తున్నాయని పేర్కొన్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ట్యాంక్‌బండ్‌పై బర్త్‌డే సెలబ్రేషన్స్, కేక్ కటింగ్స్ వద్దు?

హైదరాబాద్: ట్యాంక్‌బండ్‌పై బర్త్‌డే సెలబ్రేషన్స్, కేక్ కటింగ్స్ వద్దని హైదరాబాద్? సీపీ సజ్జనర్ ప్రజలకు సూచించారు. అర్ధరాత్రి రోడ్ల పైకొచ్చి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని, ట్యాంక్‌బండ్‌తో పాటు నగరంలోని ప్రధాన రహదారులు, చెరువులు, పార్కుల వద్ద అర్ధరాత్రి వేళల్లో పుట్టినరోజు వేడుకలు, కేక్ కటింగ్‌లు చేయవద్దని నగర ప్రజలను కోరారు. ముఖ్యంగా యువతకు, తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేస్తున్నట్లు చెప్పారు. పుట్టినరోజు నాడే దుర్మరణం చెందడం సంతోషంగా జరుపుకోవాల్సిన పుట్టినరోజు వేడుకలు క్షణికావేశం, నిర్లక్ష్యం వల్ల కుటుంబాలకు తీరని శోకాన్ని మిగులుస్తుండటం బాధాకరమన్న సజ్జనర్, రెండు రోజుల క్రితం అర్ధరాత్రి 2 గంటల సమయంలో ట్యాంక్‌బండ్‌పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరేళ్ల చిన్నారి పుట్టినరోజు నాడే దుర్మరణం చెందడం ఎంతో కలిచి వేసిందని తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే పోలీసు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని, క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి కాపాడేందుకు శతవిధాలా ప్రయత్నించినప్పటికీ ప్రాణాలు నిలపలేకపోయినట్లు పేర్కొన్నారు. బర్త్ డే కుటుంబానికి సంబంధించిన వేడుకభవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ఠమైన ముందస్తు చర్యలు చేపట్టేందుకు పోలీస్ ఉన్నతాధికారులతో కలిసి ట్యాంక్ బండ్?పై ప్రమాద స్థలాన్ని పరిశీలించామని సజ్జనర్? తెలిపారు. అక్కడ జరుగుతున్న ప్రమాదాలపై వివిధ ప్రభుత్వ విభాగాలతో కలిసి సమగ్ర సమీక్ష నిర్వహించామన్న ఆయన, పుట్టినరోజు అనేది కుటుంబానికి సంబంధించిన వ్యక్తిగత వేడుక అని, దానిని ఇళ్ల వద్ద లేదా ఏదైనా సురక్షితమైన ప్రదేశాల్లో మాత్రమే జరుపుకోవాలని స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారం పూర్తిగా నిషేధం అర్ధరాత్రి వేళల్లో రోడ్లపై జనసంచారం ఉండకపోవడంతో వాహనాలు మితిమీరిన వేగంతో దూసుకొస్తుంటాయన్న సజ్జనర్, అలాంటి సమయంలో చిన్న పిల్లలను వెంటేసుకుని నడిరోడ్డుపైకి రావడం ఎంత మాత్రం వివేకం కాదని ప్రతి ఒక్కరూ గుర్తించాలని చెప్పారు. అసలు ట్యాంక్‌బండ్‌పై ఇలాంటి వేడుకలు నిర్వహించడం నిబంధనల ప్రకారం పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. గతంలోనే జీహెచ్ఎంసీ దీనిపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని గుర్తు చేశారు. తమ పోలీసులు నిరంతరం పహారా కాస్తూ అక్కడికి వచ్చేవారిని పంపిస్తున్నప్పటికీ, అర్ధరాత్రి పూట మళ్లీ వచ్చి వేడుకలు చేసుకోవడం వల్లే ఇలాంటి విషాదాలు పునరావృతం అవుతున్నాయని, కేవలం క్షణికానందం కోసం చేసే పొరపాట్ల వల్ల అమూల్యమైన ప్రాణాలను పోగొట్టుకోవద్దని సూచించారు. ఇకపై ఎవరూ కూడా అర్ధరాత్రి వేళల్లో ట్యాంక్‌బండ్, చెరువులు, బహిరంగ ప్రదేశాల వద్దకు వచ్చి సంబురాలు చేసుకోవద్దని విజ్ఞప్తి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం వెంటనే చెల్లించాలని పట్టుబట్టారు.